క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చేగువేరా ఆదర్శంగా పోరాటం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విప్లవకారుడు చేగువేరాను ఆదర్శంగా తీసుకొని అన్యాయాలపై పోరాటం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్, డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు శివ యువకులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం చేగువేరా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ యువత ఉపాధి, ఉద్యోగం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, రోహిత్, రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఎస్‌డీఆర్ ఆకాంక్ష విద్యార్థుల ప్రతిభ



ర్యాంకు సాధించిన విద్యార్థికి బొకే అందజేసి అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నీట్ –2025 ఫలితాల్లో ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యా సంస్థ చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఆయన ర్యాంకర్లను అభినందించి మాట్లాడారు. భువన తేజ 610 మార్కులు (ఎయిర్ 221), పీవీ జితేంద్ర 543 మార్కులు (6,586) దీక్షిత్‌రెడ్డి 535 (8446), మునీ జాహ్నవి 530 (9,642), హనోక్ 424 మార్కులు (8,774 ఎస్సీ), అఖిల్ 414 మార్కులు (10,611 ఎస్సీ) సాధించారన్నారు. ఈ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన అధ్యాపకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దశ్యం

వెలుగోడు: మండలంలో పలు కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ కలసి మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ చేత ధ్వంసం చేయించారు. వన్ ఆర్ తూము వెనుక భద్రపరిచిన మద్యం బాటిళ్లు, మండల వ్యాప్తంగా అక్రమ మద్యం రవాణాతో పాటు సారా తయారీ కేంద్రాలపై జరిపిన దాడుల సమయంలో పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, సారా తయారీలకు సంబంధించి డయల్ 100, 112లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

స్పెషల్ ఆఫీసర్ ఆగ్రహం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంపై మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన ఉదయం ఏడు గంటలైనా కార్యక్రమం ప్రారంభం కాకపోవడంతో అధికారులను మందలించారు. దీంతో అధికారులు హడావుడిగా అప్పటికప్పుడు స్థానికులను పిలిపించి కార్యక్రమం మొదలుపెట్టినట్లు స్థానికులు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద శనివారం హైదరాబాద్‌కు చెందిన అర్చన బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశ పంచరత్నం, శివపంచాక్షరి, శివాష్టకం, శివ తాండం, శివశివ శంకర, శివస్తుతి, దేవీస్తుతి, తదితర అష్టకాలకు, గీతాలకు అర్చన, మానస, ప్రణవి, ప్రవల్లిక, మహాలక్ష్మి, చరిత, చందన, వైష్ణవి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.



ఈ నీరే దిక్కు..ట్యాంకుకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో బోరింగ్ నీటిని పట్టుకుంటున్న మహిళలు





నిరుపయోగంగా వాటర్‌ట్యాంకు, కుళాయి

యాళ్లూరు...నీరు అడుగుతోంది!

- నంద్యాల–గోస్పాడు మంచినీటి పథకం నుంచి నిలిచిపోయిన సరఫరా
- అలంకారప్రాయంగా మారిన ట్యాంకు, కుళాయిలు
- దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్న ఎస్సీ కాలనీవాసులు

గోస్పాడు: వర్షకాలంలోనూ గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. గొంతు తడుపుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. ఇక్కడి ఎస్సీకాలనీలోని ట్యాంకుకు నంద్యాల–గోస్పాడు స్కీమ్ ద్వారా చిన్న చెరువు నుంచి నీరు సరఫరా అవుతుంది. అయితే, ఆ చెరువులో నీరు అడుగంటిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. నాలుగైదు నెలల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. దీంతో వందలాది కుటుంబాలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. చేతిపంపుల నీరు తాగేందుకు పనికి రాదని తెలిసినా తప్పని పరిస్థితిలో ఎస్సీ కాలనీవాసులు ఆ నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. వర్షాకాలంలో శుద్ధి చేసిన నీటినే తాగాలని లేకపోతే వ్యాధులు దరిచేరుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం వివరణ కోరగా ప్రస్తుతం ఎస్సీ కాలనీలోని ట్యాంకుకు నీటి సరఫరా నిలిచిపోయిందని, ఈ సమస్యను పంచాయతీ అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడించారు.

కుళాయిలు ఉండి ప్రయోజనం లేదు



మా ఇళ్ల వద్ద కుళాయిలు ఉన్నా ఫలితం లేదు. వాటికి సక్రమంగా నీటి సరఫరా ఉండదు. ప్రతి రోజు చేతి పంపుల వద్దకెళ్లి ఈ నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. నీళ్ల కోసం పనులు వదులుకోవాల్సి వస్తుంది. తప్పని పరిస్థితిలో ఇంటి అవసరాలకు వాడే నీటితోనే దాహం తీర్చుకుంటున్నాం. – సరస్వతి, యాళ్లూరు

అధికారులు పట్టించుకోవడం లేదు



గత కొన్ని నెలలుగా ఎస్సీ కాలనీలో సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదు. ట్యాంకుకు ఎప్పుడు నీళ్లు వస్తాయో ఎప్పుడు రావో తెలియని పరిస్థితి. పడిగాపులు కాయలేక బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఈ నీటితో రోగాలు వస్తాయని భయం. ఈ విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాసులు, ఎస్సీ కాలనీవాసి

క్రీడలతో గుర్తింపు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: క్రీడల్లో రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆళ్లగడ్డ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు




కుంకుమార్చన పూజలో భక్తులు



అల్పాహారం వడ్డిస్తున్న దాతలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసపురం వెంకటేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు వారణాసి గోపీ శర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు స్వామి అమ్మవార్ల కుంకుమార్చన పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తాదులకు శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామ సర్పంచు రాధిక, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు మందాల శివరెడ్డి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు.





పుట్టమన్నుతో అమ్మవారికి పొంగుపాలు సిద్ధం చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో గంగమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జాతరలో భాగంగా శనివారం అమ్మవారికి పుట్టమన్ను తెచ్చి పొంగుపాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. బొల్లేవుల పాట్లాట, గంగా కాటమరాజు కథను భక్తులకు వివరించారు. తిరునాల సందర్భంగా బంధు మిత్రులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం అమ్మ వారికి గ్రామస్తులు బోనాలతో నైవేద్యం సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంజేడులో ఉచిత వైద్య శిబిరం

మండలంలోని ఇంజేడు గ్రామంలో గంగమ్మ జాతరను పురస్కరించుకుని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి వినోద్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జాతర సందర్భంగా ఎలాంటి అంటు రోగాలు ప్రబలకుండా గృహ పరిసరాల ఆవరణలో మురుగు నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తాం



గాంధీచౌక్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు మహమ్మద్ గౌస్, ఉపాధ్యక్షుడు తోట మద్దు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ హెచ్చరించారు. శనివారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి సంజీవనగర్, శ్రీనివాససెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు 250 మందికి పైగా కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. జీవో నం.36 ప్రకారం కార్మికులందరికీ రూ.21 వేలు ఇవ్వాలని, గ్రేడ్‌ల ప్రకారమైతే రూ.24 వేలు వర్తించే అవకాశం ఉందన్నారు. పది సంవత్సరాలు చేసి రిటైర్డు అయిన వారందరికీ రూ.75 వేలు బెనిఫిట్స్ ఇవ్వాలని, మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరాచారి, ఆదాము, మురళీ, కృష్ణయ్య, రాజశేఖర్, సతీష్, సిద్దయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో భద్రత పెంచుకోవాలి



రుద్రవరంలో ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ దస్తగిరిబాబు

రుద్రవరం: ఆలయాల్లో దొంగతనాలు జరగకుండా భద్రతను కట్టుదిట్టంగా ఏర్పాటు చేసుకోవాలని శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారిశాల, భాస్కరనందీశ్వర స్వామి, దొర్వి లక్ష్మీనరసింహస్వామి, గుట్టకొండ నరసింహస్వామి, అప్పనపల్లె దారిలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయాలు, వాటి పరిసరాలను శనివారం ఆయన పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై ఆలయాధికారులు, కమిటీ సభ్యులతో చర్చించి సూచనలు చేశారు. ఆలయాల్లో ఏవైనా విలువైన వస్తువులు ఉంటే వాటిని సేఫ్ లాకర్లలో ఉంచుకోవాలని అలాగే హుండీల్లోని ఆదాయాన్ని ఎప్పటికప్పుడు తీస్తూ ఉండాలని సూచించారు. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లు ఉండాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ రాంభూపాల్‌రెడ్డి ఉన్నారు.

మహానందిలో విజయవాడ డీఐజీ పూజలు



మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన డీఐజీ అమ్మిరెడ్డి, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందిలో శనివారం రాత్రి విజయవాడ డీఐజీ అమ్మిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఆత్మకూరు ఆర్డీఓ

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి శనివారం సందర్శించారు. ఆమెకు ఆలయ పురోహితులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని వేపదారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, మంగళహారతి పూజలు చేసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. కృష్ణానది ప్రవాహాన్ని, తీరప్రాంతాన్ని పరిశీలించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి విరాళం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో భక్తులు, గ్రామస్తుల సౌకర్యార్థం మూలపెద్దమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఈ సందర్భంగా సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాయలూరు విశ్వనాథరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, మిద్దె చిన్నన్న, కంపమల్ల పెద్దన్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి, పొలిమేర రెడ్డి, మాజీ సర్పంచి కర్నాటి క్రిష్టారెడ్డిలు మాట్లాడుతూ విరాళాలు ఇవ్వాలనుకున్న దాతలు ముందుకు రావాలని కోరారు.

ఎస్సార్‌బీసీ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. అనుసంధానంగా ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌లను మూసివేసి సుమారు వెయ్యి క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్‌కు మూడు రోజులుగా విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో బనగానపల్లె, పాణ్యం, నంద్యాల మండలాల్లో 13 బ్లాక్‌లు ఉండగా 1.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నెల 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం.. ఆశాజనకంగా కురుస్తున్న వర్షానికి ఆయకట్టు రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేశారు. నియోజకవర్గంలో 26 వేల ఎకరాల్లో సాధారణ సాగు ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఆయకట్టు రైతులు ఇప్పటికే ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నందున ఎస్సార్‌బీసీ నీటిని బ్లాక్‌ల ద్వారా విడుదల చేసి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.


ఆలయ భూములకు వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాల్వ గ్రామానికి చెందిన పలు ఆలయాలకు చెందిన భూములను కౌలుకు బహిరంగ వేలం నిర్వహించామని గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ తెలిపారు. శివ నందీశ్వర స్వామి ఆలయానికి చెందిన 23.28 ఎకరాలను రూ.5.20 లక్షలకు, చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 35.15 ఎకరాలను రూ.8.43 లక్షలకు, వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 4.04 ఎకరాలను రూ.1.66 లక్షలకు, భైరవ స్వామి ఆలయానికి చెందిన 10.70 ఎకరాలను రూ.4.06 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా గడివేముల మండల గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి రామలింగారెడ్డి, ఎస్ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న కేసీ లైనింగ్



కొత్త ముచ్చుమర్రి–పగిద్యాల మధ్య ధ్వంసమైన కేసీ కాలువ

పగిద్యాల: కర్నూలు–కడప రైతాంగానికి వరప్రదాయిని అయిన కేసీ కాలువ సిమెంట్ లైనింగ్ పగుళ్ల బారి దెబ్బతినింది. బ్రిటీష్ హయాంలో నిర్మితమైన ఈ కేసీ కాలువను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పాలన సాగించిన స్వర్గీయ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో జపాన్ నిధుల సాయంతో ఆధునీకరించారు. అప్పట్లో పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు కాంట్రాక్టు దక్కించుకుని పనులు ముగించారు. అయితే కాలువ లైనింగ్ ప్రస్తుతం అడుగడుగునా దెబ్బతిని సిమెంట్ బెడ్ ధ్వంసమైంది. దెబ్బతిన్న ప్రాంతంలో మట్టి కొట్టుకుపోయి కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున తుంగభద్ర జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుకుంటోంది. ఈ ఏడాది వరి నాట్లు ముందస్తుగానే నాటుకునే అవకాశం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. కేసీ కాలువకు సాగు, తాగునీటిని విడుదల చేయక ముందే దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్ బెడ్ పనులను సత్వరమే చేపట్టి కేసీ కాలువ ఉనికిని కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ నందికొట్కూరు సెక్షన్ ఏఈఈ వీరమ్మను వివరణ కోరగా దెబ్బతిన్న మాట వాస్తవమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో యోగాసనాలు చేస్తున్న ఉద్యోగులు



రుద్రవరం మండల పరిషత్ వద్ద యోగా చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: యోగాసనాల ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుందని మండల ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, సచివాలయ, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఒత్తిళ్లకు గురి కాకుండా యోగాభ్యాసాలు ప్రతి రోజు కార్యాలయాలకు చేరుకున్న తరువాత చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 వీరప్రతాప్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, మోడల్‌స్కూల్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

యోగాడేను విజయవంతం చేయాలి

దొర్నిపాడు: ఈనెల 21న జరిగే యోగాడేలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సావిత్ర తెలిపారు. శనివారం గ్రామ సచివాలయాల పరిధిలో డెమో యోగాడేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి, కట్టుబడి బాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఓబులేసు, నాగార్జున, ఉపసర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- **రుద్రవరం:** దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ నీరజ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులందరితో ఆమె యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉండటంతో పలువురికి యోగాపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే రుద్రవరంలోని గ్రామ సచివాలయం-1 వద్ద ఈఓ సుబ్బారావు కాలనీ వాసులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.
- **చాగలమర్రి:** మండల కేంద్రం చాగలమర్రిలోని 3వ సచివాలయంలో శనివారం యోగా డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి జగ్గయ్య హాజరయ్యారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ తేజస్విని, విష్ణుప్రియ, ఏపీఓ ఖాశీం సాహెబ్, మండల కో–ఆర్డి నేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో ఇండియా బ్లడ్ బ్యాంక్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈకార్యక్రమంలో గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. యువతీయువకులు రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో 50 మంది విద్యార్థులు రక్తదానం చేయడంతో వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

- పట్టణంలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇక్కడ ఎన్‌సీసీ కేడెట్లు 31మంది రక్తదానం చేసినట్లు ఎన్‌సీసీ కమాండ్ ఆఫీసర్ కల్నల్ జోబి ఫిలిప్ తెలిపారు.. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల నిర్మాణానికి, సాగుకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తున్నాయన్నారు. కార్మికుల సంక్షేమాన్ని పాలకులు గాలికి వదిలేశారని మండిపడ్డారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి, 5 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి బాబాఫకృద్దీన్, నారాయణ, హరినాథలతో పాటు సభ్యులు రంగనాయుడు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఘటనలపై మంత్రి ఆగ్రహం

- టికెట్ల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం
- రెండు టికెట్లే తేడా ఉన్నాయని తేల్చిన డీఈఓ



టికెట్ల కౌంటర్ల వద్ద విచారణ చేస్తున్న డీఈఓ మోహన్, ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి

మహానంది: మహానంది దేవస్థానంలో జరుగుతున్న వరుస ఘటనలపై రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వరుసగా పత్రికల్లో ఆలయంలో జరుగుతున్న అవకతవకలు, గోల్‌మాల్, దోపిడీ అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. ఇటీవల ఓ దిన పత్రికలో(సాక్షి కాదు) ఈనెల 10న మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన 60 మంది భక్తులు రూ.20 టికెట్లు కొనుగోలు చేయగా, సిబ్బంది కేవలం 20 మందికి మాత్రమే టికెట్లు ఇచ్చారని, వాటితోనే అందరూ దర్శనం చేసుకోవచ్చని వచ్చిన వార్తపై విచారణకు ఆదేశించడంతో శనివారం జిల్లా దేవదాయశాఖ అధికారి మోహన్, టెంపుల్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆలయానికి చేరుకుని విచారణ చేశారు. ఏఈఓ ఎరమల మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేశారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ అదే రోజు 60 మంది భక్తులు టికెట్లు కొనలేదన్నారు. ఆరుగురికి ఐదు టికెట్లు ఇచ్చారని, మరో ముగ్గురు వస్తే రెండు టికెట్లే ఇచ్చారన్నారు. దీంతో రెండు టికెట్లే వ్యత్యాసం ఉందన్నారు. ప్రవేశ మార్గం ద్వారా గుర్తించినా ఎలాంటి లోపం కనిపించలేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని గ్రూపు ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి 'సాక్షి'కి తెలిపారు.